క్లుప్తంగా

సీఎం సభకు తరలివెళ్లిన ప్రజానీకం



చేబ్రోలు: పొన్నూరులో సోమవారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు మండలంలోని 13 గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఏడేళ్ల తరువాత పొన్నూరు పట్టణానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అభిమానులు, పార్టీ శ్రేణులు చూసేందుకు ఎగబడ్డారు. యువత ఉత్సాహంతో బైక్ ర్యాలీ నిర్వహించింది. చేబ్రోలు, శేకూరు, వడ్లమూడి, వేజండ్ల తదితర గ్రామాల నుంచి ప్రజానీకం సీఎం సభకు వెళ్లారు. మంచాల గ్రామం నుంచి ప్రత్యేకంగా ఆటోలు, బైక్‌లతో ర్యాలీగా తరలివెళ్లారు.

ప్రాంగణ ఎంపికల్లో 'చలపతి' విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి లక్ష్యంగా తమ కళాశాల విద్యా బోధన సాగుతుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. సోమవారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో దివీస్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారన్నారు. సంస్థ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు రూ.2.8 లక్షల వార్షిక వేతనంతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల అధినేత వైవీ ఆంజనేయులు అభినందించారు.

వేడుకగా 'విజయ గణపతి' వార్షికోత్సవం



గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలో వేంచేసియున్న విజయ గణపతి దేవాలయం 6వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామ మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో స్వామి వారికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ.. గోరంట్ల గ్రామ అభివృద్ధిలో వేణుగోపాల్ పాత్ర వెలకట్టలేనిదన్నారు. యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ గోరంట్ల గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కంచెర్ల ఆంజనేయులు, ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బుర్ల రామాంజనేయులు, తాడిశెట్టి మురళి, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ఆటో

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు
- పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా దుర్ఘటన

ప్రత్తిపాడు: వివాహానికి వెళ్లి వస్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందగా, మరో ముగ్గురు తీవ్ర గాయాల పాలైన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రత్తిపాడు మండలం గనికపూడి గ్రామానికి చెందిన అంచా వేణుగోపాలరావు తన కుమార్తె నాగవర్ధినికి ఆదివారం రాత్రి ద్వారకా తిరుమలలో వివాహం చేశాడు. వివాహ కార్యక్రమానికి గనికపూడి నుంచి బంధువులు ఆటోలో వెళ్లారు. వివాహం అనంతరం వధువు కుటుంబ సభ్యులు ద్వారకా తిరుమలలోనే ఉండిపోగా, బంధువులు ఆటోలో స్వగ్రామానికి బయల్దేరారు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో ప్రత్తిపాడు మండలం యనమదల 16వ నంబరు జాతీయ రహదారిపై అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ ఆటో డ్రైవర్ ఎస్కే ఫణీంద్ర ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న గుత్తా శేషయ్యతో పాటు అదే గ్రామానికి చెందిన కాండ్రు సాయి కీర్తి, అంచా సాయి లక్ష్మి, గద్దె అనూషకు గాయాలయ్యాయి. 108లో క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శేషయ్య మృతి చెందాడు. ఈ మేరకు అంచా వేణుగోపాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు తెలిపారు.

బాల్య వివాహంపై ఫిర్యాదు

గుంటూరు రూరల్: మైనర్ బాలికకు వివాహం జరిపించారనే విషయం తెలుసుకున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) అధికారిణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. గుంటూరు నగరం రెడ్డిపాలెంలోని హిమనినగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. 15 ఏళ్ల మైనర్ బాలిక వివాహం గురించి ఐసీడీఎస్ అధికారిణి కె.సౌమ్యకి 1098 నంబరు ద్వారా సమాచారం అందుకున్నారు. అనంతరం నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వర్ణపురి అభిమాన ఝరి

జన సంద్రమైన సీఎం జగన్ సభ



కార్యక్రమంలో పాల్గొన్న అప్పిరెడ్డి, మద్దాళిగిరిధర్ తదితరులు



సీఎం రాకను ఫోటోలు తీస్తున్న అభిమానులు



ప్రసంగం వింటున్న మహిళలు



మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



పార్టీ జెండాలు, బెలూన్లతో సందడి చేసిన కార్యకర్తలు



నటుడు కృష్ణ, మహేష్‌బాబు వేషధారణ



జననేత మాస్క్‌తో మహిళ



టీవీఎస్‌పైకి ఎక్కి సీఎంను చూస్తున్న మహిళ



ట్రాక్టర్‌లో కల్లు కుండల తాటిచెట్టుతో కల్లుగీత కార్మికుల మద్దతు

పొన్నూరు/చేబ్రోలు: గత ఎన్నికల ముందు పాదయాత్రగా.. ఇప్పుడు సీఎం హోదాలో.. ఇలా కార్యక్రమమేదైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుపెట్టారంటే అభిమాన ఝరితో పొన్నూరు జనసంద్రమవుతోంది. సోమవారం సీఎం వైఎస్ జగన్ పాల్గొన్న బహిరంగ సభకు ప్రజలు, మహిళలు భారీ స్థాయిలో తరలిరావడంతో పొన్నూరు అంబేడ్కర్ సెంటరు కిక్కిరిసింది. హెలీ ప్యాడ్ వద్ద ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు పొన్నూరు ముఖ్య నేతలకు సీఎం జగన్ కరచాలనం చేసి ఆప్యాయంగా పలకరించారు. అంబేడ్కర్ సెంటర్‌లోని బహిరంగ సభ ప్రదేశానికి బస్సు యాత్రగా ప్రజలకు అభివాదం చేస్తూ చేరుకున్నారు. బహిరంగ సభవద్ద గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణతో పాటు స్థానిక నేతలు సీఎంకు ఘన స్వాగతం పలికారు. సీఎం వారిని ఆప్యాయంగా పలకరించారు. జై జగన్ నినాదాలతో పొన్నూరు హోరెత్తింది. యువత ఉత్సాహంగా భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. పార్టీ టోపీలు ధరించి, జెండాలు ఎగరవేస్తూ కార్యకర్తలు అభిమానాన్ని చాటారు. సినీ నటుల వేషధారణ, డ్యాన్స్‌లతో ఉత్సాహపరిచారు. దాహార్తిని తీర్చేందుకు ప్రజలకు మజ్జిగ, తాగునీటిని అందించారు. కార్యక్రమంలో గుంటూరు డిప్యూటీ మేయర్ బాలవజ్ర బాబు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, రాష్ట్ర మైనారిటీ కమీషన్ సభ్యుడు షేక్. సైపుల్లా, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్. రూత్ రాణి, ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ రమేష్, పట్టణ అధ్యక్షుడు ఎంఏ మహమూద్, నాయకులు నాజర్, ప్రసాద్, వంశీరెడ్డి, వేణుప్రసాద్, సాంబశివరావు, షేక్. మాము, వెంకట సుబ్బయ్య, ఆదిశేషులు, నారాయణరావు, రంగారావు, రంగారావు, గోపి, వెంకటేశ్వరరావు, రామ్మోహన్, షేక్. జానీ బాష, కరీం, ఫజరుల్లా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చెప్పారంటే.. చేస్తారంతే!

- ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్
- 46వ డివిజన్ నగరాలులో ఎన్నికల ప్రచారం



ఫ్యాను గుర్తుకు ఓటువేయాలని అభివాదం బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: జగనన్న చెప్పారంటే.. చేస్తారని, చేయలేని పనులను ఆయన చెప్పరని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం 46వ డివిజన్ నగరాలులో డివిజన్ అధ్యక్షుడు ఆరిక శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బలసానికి సాదర స్వాగతం పలికారు. హారతులు ఇచ్చి, మహిళలు వీర తిలకం దిద్దారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి బలసాని కిరణ్ కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో దళితులు, పేదలు, అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందించారని తెలిపారు. ఎన్నికల హామీ.. నవరత్నాల పథకాలతోపాటు అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారని కొనియాడారు. నేడు సంక్షేమ పథకాలను మరింత మెరుగుపరిచి ప్రజలకు అందించేందుకు జగనన్న సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను ప్రత్తిపాడు నియోజకవర్గంలో తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. చంద్రబాబు కూటమి పేరుతో రిజర్వేషన్లను రద్దు చేయించి, పేదలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, యార్డ్ డైరెక్టర్‌లు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు రిజిస్టర్‌ను కచ్చితంగా తనిఖీ చేయించాలి

- లేదంటే అభ్యర్థులపై అనర్హత వేటు
- ప్రత్తిపాడు రిటర్నింగ్ ఆఫీసర్ పి. శ్రీకర్



ప్రత్తిపాడు: ఎన్నికల ఖర్చుల రిజిస్టర్‌ను కచ్చితంగా ఎన్నికల వ్యయ పరిశీలకులతో తనిఖీ చేయించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న పదమూడు మంది అభ్యర్థులు 1951 భారత ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 77 (జీ) ప్రకారం తమ ఎన్నికల ఖర్చులను ఎన్నికల ఖర్చుల రిజిస్టర్ నందు నమోదు చేయాలన్నారు. నమోదు చేసిన ఎన్నికల ఖర్చుల రిజిస్టర్‌తో పాటు సంబంధిత ఖర్చుల బిల్లులు లేదా ఓచర్లతో ఏప్రిల్ 30, మే నెల 4, 11 తేదీల్లో ఎన్నికల వ్యయ పరిశీలకులతో తనిఖీ చేయించుకునేందుకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులదరూ నిర్ణీత తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు రిజిస్టర్ తనిఖీ చేయించాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో 1951 భారత ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 10 (ఏ) ప్రకారము అనర్హతకు గురవుతారని వివరించారు. అభ్యర్థి నేరుగా కానీ లేదా అభ్యర్థి ఎన్నికల ఏజెంట్ ద్వారా కానీ తనిఖీకి ఎన్నికల ఖర్చుల రిజిస్టర్‌తో హాజరు కావచ్చని శ్రీకర్ వివరించారు.

హోం ఓటింగ్‌ను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలి

తూర్పు ఆర్ఓ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన ఆర్ఓ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 3వ తేదీ నుండి ప్రారంభమయ్యే హోం ఓటింగ్‌ని అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని, హోం ఓటింగ్ సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి పోలింగ్ ఏజెంట్లు కూడా ఉంటారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో హోం ఓటింగ్, ఈవీఎంల కమిషనింగ్, ఫెసిలిటేషన్ సెంటర్స్ అంశాలపై ఏఆర్‌ఓలతో కలసి సెక్టార్ అధికారులు, హోం ఓటింగ్ బృందాలు, పోస్టల్ బ్యాలెట్ బృందాల సభ్యులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధానంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. హోం ఓటింగ్ సమయంలో పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ రికార్డ్ చేయబడుతుందని వివరించారు. ఓటింగ్ రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరగాలని, ఓటు వేసే వారికి ప్రత్యేక కంపార్ట్మెంట్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. తూర్పులో హోమ్ ఓటింగ్ కోసం ఐదు బృందాలు ఏర్పాటు చేశామమని, ఆయా బృందాలను పర్యవేక్షణకు ఏఆర్ఓ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో మైక్రో అబ్జర్వర్ టీంలను కూడా నియమించామన్నారు. క్షేత్ర స్థాయిలో సహకరించని బీఎల్‌ఓల వివరాలు వెంటనే ఏఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సునీల్ కుమార్, భీమరాజు, ప్రదీప్ కుమార్, వెంకటలక్ష్మి, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి పాత జాతీయ రహదారి వెంబడి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. స్క్వాడ్ ఇన్‌చార్జి అశోక్ మాట్లాడుతూ.. ఎటువంటి ఆధారాలు లేకుండా నగదు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఏవైనా వస్తువులు తరలిస్తున్నారా అనే విషయాలను పరిశీలిస్తున్నామన్నారు.

నేడు కొండపాటూరు పోలేరమ్మ తిరునాళ్ల



కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరు గ్రామంలో మంగళవారం శ్రీ కొండపాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా రైతులు వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత వచ్చే అమ్మవారి తిరునాళ్లను రైతులు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. తిరునాళ్లలో జెయింట్ వీల్స్, రంగుల రాట్నాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా ఉండేందుకు దేవాలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు కంఠమనేని నరేష్‌కుమార్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 303 పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తునట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా వాహన రాకపోకలకు పలు ఆంక్షలు విధించినట్లు ఆయన తెలిపారు. తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా మొక్కులు తీర్చుకుని, అమ్మ వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ ఈఓ సురేష్ తెలిపారు.

17 నుంచి బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మే నెల 17వ తేదీ నుంచి బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందని, వయోపరిమితి 19 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయంతో పాటు ఉచిత హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, గుంటూరు, 0863-2336912, 9949930155 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

ముగిసిన అంతర్జాతీయ నృత్య ప్రదర్శనలు



నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు సోమవారంతో ముగిశాయి. తొలుత నటరాజ పూజ, నృత్య నివేదనంగా 108 మంది శరణం భవకరుణామయ తరంగాన్ని సంప్రదాయ దుస్తులతో నర్తించారు. సాయంత్రం జరిగిన సభకు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, బూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రం ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, పసుమర్తి రామలింగేశ్వరశాస్త్రికి కూచిపూడి నాట్య విద్వాంసులు పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారం అందించారు. యువ కళారత్న పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, పెద్ది మాధవి, రాధిక పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో ఉన్నది వీరే..

- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- ఎన్నికల సంగ్రామంలో 13 మంది అభ్యర్థులు
- గుర్తులు కేటాయించిన ఆర్వో పి. శ్రీకర్



బలసాని కిరణ్‌కుమార్ (వైఎస్సార్‌సీపీ)



బూర్ల రామాంజనేయులు (టీడీపీ)



మురళీధర్. జి (బీఎస్పీ)

ప్రత్తిపాడు: నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసిన అధికారులు 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించారు. సోమవారం నామినేషన్ల ఉప సంహరణ గడువు ముగిసింది. దీంతో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన తొమ్మిది మంది అభ్యర్థులు, నలుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు చొప్పున మొత్తం పదమూడు మంది అభ్యర్థులు ఎన్నికల సంగ్రామంలో నిలిచారు. ఎన్నికల పోటీలో నిలిచిన వారి వివరాలతో పాటు కేటాయించిన గుర్తులను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ వెల్లడించారు.

అభ్యర్థి పేరు	పార్టీ	ఎన్నికల గుర్తు
బలసాని కిరణ్‌కుమార్	వైఎస్సార్ సీపీ	సీలింగ్ ఫ్యాన్
కొరివి వినయ్‌కుమార్	భారత జాతీయ కాంగ్రెస్	హస్తం
బూర్ల రామాంజనేయులు	తెలుగుదేశం	సైకిల్
మురళీధర్. జి	బహుజన సమాజ్	ఏనుగు
చల్లా శరత్‌కుమార్	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	టెలివిజన్
పల్లపాటి నవీన్	జై భారత్ నేషన్	బ్యాటరీ టార్చ్
పాల్ యండ్రపాటి	ఇండియన్ లేబర్	రొట్టె
బుర్రి రాంబాబు	జాతీయ జనసేన	పెన్ స్టాండ్
ఎస్.ఎస్.రాణి (మహాలక్ష్మి)	భారత చైతన్య యువజన	గన్నా కిసాన్
కత్తి అరుణ్‌కుమార్	స్వతంత్ర అభ్యర్థి	కుండ
చంద్రం కృష్ణంరాజు	స్వతంత్ర అభ్యర్థి	కరెంటు స్తంభం
బెజ్జం నాగరాజు	స్వతంత్ర అభ్యర్థి	విజిల్
కె. రజనీకాంత్	స్వతంత్ర అభ్యర్థి	బక్కెట్

విలువ జోడింపుతోనే లాభసాటి వ్యవసాయం

నాబార్డ్ జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ శరత్



తేనెటీగల పెంపకంపై వివరిస్తున్న రైతనేస్తం ఫౌండేషన్ ప్రతినిధులు

గుంటూరు రూరల్: సేంద్రియ వ్యవసాయంలో పండించిన పంటలకు విలువ జోడింపుతోనే లాభసాటి చేయవచ్చని నాబార్డ్ గుంటూరు జిల్లా మేనేజర్ శరత్ తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన రైతు శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ పంటల సాగును లాభాల బాటలో నడిపించాలంటే వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి మంచి ధరలు లభించే ప్రాంతాకల్లో అమ్మకం చేయడమే మంచి మార్గమని తెలిపారు. నాబార్డు సహకారంతో రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. తక్కువ పెట్టుబడితో తేనెటీగల పెంపకం చేపట్టవచ్చని వివరించారు.శిక్షణ తరగతుల్లో పాల్గొన్న రైతులకు సర్టిఫికెట్లను అందజేశారు. రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, డీపీఎ కె.రాజకుమారి, డీఎల్ఎంపీ జె.సత్యనారాయణ, తేనెటీగల పెంపకం దారు చలపతిరావు, సేంద్రియ రైతు శబరీనాథ్ పాల్గొన్నారు.